తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
శుక్రవారం
2 అక్టోబర్ 2026
పేజీలు - 12

# అరణ్య రోదన?

- యదేచ్ఛగా కొనసాగుతున్న వన్యప్రాణుల వేట
- వేటగాళ్ల ఉచ్చులకు బలవుతున్న వన్యప్రాణులు
- నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న అటవీశాఖ అధికారులు
- చర్యలు చేపట్టాలని జంతు ప్రేమికుల డిమాండ్

**వెంకటాపూర్(రామప్ప), అక్టోబర్ 01 (జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేట యదేచ్ఛగా కొనసాగుతోంది. రోజురోజుకీ పెరుగుతున్న ఎండల తీవ్రతతో అడవిలోని నీటి వనరులు ఎండిపోవడంతో నీటి కోసం బయటకు వస్తున్న మూగజీవాలు వేటగాళ్ల ఉచ్చుల్లో చిక్కి బలవుతున్నాయి. దీంతో వెంకటాపూర్ మండలంలోని అటవీ ప్రాంతాలు వన్యప్రాణుల మృత్యువాతతో రోదిస్తున్నాయి. ములుగు జిల్లాలో అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉంది. అందులో వాజేడు, మంగపేట, తాడ్వాయి మండలాలతో పాటు వెంకటాపూర్ మండల పరిధిలో అడవి ఎక్కువగా ఉంది. ఈ అడవుల్లో చిరుత పులులు, పెద్ద పులులు, ఎలుగుబంట్లు, కొండ గొర్రెలు, దుప్పులు, కుందేళ్ళు, అడవి పందులు, ముళ్లపందులు, అడవి దున్నలు తదితర వన్యప్రాణులు సంచరిస్తుంటాయి. ఇదే అదునుగా భావించిన కొంతమంది వేటగాళ్లు వెంకటాపూర్ మండలంలోని సమీప అడవుల్లో నీటి చెలమలు, చెరువులు, వాగుల వద్ద క్లచ్ వైర్లతో ఉచ్చులు, వలలు ఏర్పాటు చేయడంతో పాటు అటవీ సరిహద్దు ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రాల వద్ద సైతం కరెంట్ తీగలతో కూడిన ఉచ్చులను ఏర్పాటు చేసి వన్యప్రాణుల వేట కొనసాగిస్తున్నట్లు తెలిసింది. వెంకటాపూర్ మండలంలోని కొందరు ఒకప్పుడు మాంసం కోసం వేటాడితే ఇప్పుడు అది వ్యాపారంగా మారినట్లు సమాచారం. వేటగాళ్లు అమర్చిన ఉచ్చులకు చిక్కిన వన్యప్రాణులను అటవీ ప్రాంతంలోనే ముక్కలుగా చేసి ఆ మాంసాన్ని పట్టణాలకు తరలిస్తూ అక్రమ సంపాదనకు తెరలేపినట్లు తెలిసింది. అంతేకాకుండా కొన్ని సందర్భాల్లో గ్రామాల్లో తమకు దగ్గరగా ఉండే వారికి కిలో రూ.1,000 నుండి రూ.1,500 చొప్పున మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. వెంకటాపూర్ మండలంలోని అటవీ ప్రాంతం మొత్తం భూపాలపల్లి, ములుగు, పసర రేంజ్ పరిధిలో ఉంటుంది. అటవీ శాఖలో సిబ్బంది కొరతతో పాటు అధికారుల నిర్లక్ష్యం మూలంగా వేటగాళ్లు రెచ్చిపోతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి వెంకటాపూర్ మండలంలోని అడవుల్లో జరుగుతున్న వన్యప్రాణుల వేటను నివారించడంతో పాటు అడవుల్లో అక్రమంగా వన్యప్రాణులను వేటాడుతున్న వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులతోపాటు జంతు ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.





## కేంద్ర నిధుల పనులకు ఏడాదిలోపే బిల్లులు

- రాష్ట్ర నిధుల పనుల బిల్లుల్లో జాప్యం
- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**నిర్మల్/లోకేశ్వరం, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** అభివృద్ధి పనులు చేపట్టి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నామని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పనులు చేపట్టామని, వచ్చిన అరకొర బిల్లులు వడ్డీలకే సరిపోతున్నాయని తెలిపారు. గురువారం నిర్వహించిన లోకేశ్వరం మండల సర్వసభ్య సమావేశానికి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, వీవో భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరైనా.. గతంలో చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో కొత్త పనులు చేపట్టేందుకు సర్పంచులు వెనుకడుగు వేస్తున్నారని పంచాయతీరాజ్ ఏఈ సాయి వర్ధన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులకు ఏడాదిలోపే బిల్లులు వస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వ నిధుల పనుల బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు వెనక్కి వెళ్లకుండా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సర్పంచులకు సూచించారు. చెరువుల మరమ్మతులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, మిషన్ భగీరథ నీటి సరఫరా, విద్యుత్ సమస్యలను మిగతా 2లో..



## రంగసాయిపేటలో బొడ్డెమ్మ వేడుకలు

**ఖిలా వరంగల్ మండలం, అక్టోబర్ 01 ( జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 42వ డివిజన్ ఆదర్శ నగర్లోలోని చీకటి సరోజన ఇంట్లో గురువారం బొడ్డెమ్మ వేడుకలను ప్రారంభించారు. గత 15 సంవత్సరాలుగా ఆదర్శ నగర్లో మహిళలంతా కలిసి బొడ్డెమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలు పెద్దలు అంత కలిసి బొడ్డెమ్మ పాటలు పాడుతూ ఆడుతూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. బొడ్డెమ్మ అందరిని సుఖసంతోషాలతో ఉంచాలని ఈ సందర్భంగా వేడుకున్నారు.

## వయోవృద్ధుల అనుభవాలను భావితరాలకు అందించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలు



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 01 (జనం సాక్షి) :** వయోవృద్ధులు గతాన్ని తలచుకుని బాధపడకుండా, ఎలాంటి ఉద్రేకాలకు లోనుకాకుండా ప్రశాంతంగా వర్తమానాన్ని ఆనందంగా గడపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. కుటుంబంలో, సమాజంలో ఓర్పుతో సర్దుబాటు అవుతూ తమ విలువైన అనుభవాలను భావితరాలకు అందించాలని కోరారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన, విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో వయోవృద్ధుల అనుభవాలు ఎంతో కీలకమన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న 'స్ఫూర్తి' కార్యక్రమంలో విశ్రాంత విద్యావంతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకోవడం అభినందనీయమన్నారు. వయోవృద్ధుల అనుభవాలను పిల్లలతో పంచుకోవడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి, భయం లేకుండా వేదికలపై మాట్లాడే సామర్థ్యం, ఆసక్తి పెరుగుతున్నాయని తెలిపారు. వయోవృద్ధులు కృంగిపోకుండా ప్రశాంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, గతాన్ని గుర్తుచేసుకుని బాధపడకుండా ప్రస్తుతాన్ని సంతోషంగా ఆస్వాదించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ ఆస్తిపాస్తులను తమ వద్దే ఉంచుకోవాలని, అవసరమైతే వీలునామా రాయాలని కలెక్టర్ సూచించారు. కొడుకులు, కూతుళ్లకు ముందుగానే సేల్‌డీడ్ లేదా గిఫ్ట్‌డీడ్ చేయకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. వయోవృద్ధులకు ఏవైనా సమస్యలు ఎదురైతే 14567 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి అవసరమైన సహాయం పొందాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్లు మాట్లాడుతూ వయోవృద్ధులు తమ హక్కులు, వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు ఆర్డీవో, జిల్లా కలెక్టర్ లేదా జిల్లా సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. ఆర్డీవో నర్సంపేట ఉమారాణి మాట్లాడుతూ వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి అధికారులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, వారికి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. మిగతా 2లో..

# ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలి

● **ఎమ్మెల్యే కోరం కనకయ్య**

**బయ్యారం అక్టోబర్ 1(జనంసాక్షి) :** రేవంత్ రెడ్డి నాయకత్వంలో ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా ప్రజా ప్రతినిధులు ,అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిదుల్, అధికారుల తో సమన్వయ,సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ అధికారులు,ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో పలువురు సర్పంచ్ లు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుక వచ్చారు. ముఖ్యంగా అటవీ శాఖా,మిషన్ భగీరథ,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ,విద్యుత్ కోతలు తదితర సమస్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జగతరావు పేట సర్పంచ్ మోహన్ జీ,కొత్త పేట సర్పంచ్ ప్రవీణ్ నాయక్, అల్లిగూడెం,కస్తూరి నగరం సర్పంచులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కోసం మట్టిని ,గులకరాయిని తెచ్చుకోకుండా అటవీ శాఖా అధికారులు ఇబ్బందులు కల్పిస్తున్నారని



తెలిపారు. చివరికి మాస్వంతభూముల్లోని మట్టిని కుడా తెచ్చుకొనివ్వడం లేదని దీంతో ఇండ్ల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని ఎమ్మెల్యే కు వివరించారు. అదేవిధంగా మిషన్ భగీరథ నీళ్లు వారాల తరబడి రావటం లేదని సర్పంచులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంకట్రాంపురం సర్పంచ్ శివాజీ మాట్లాడుతూ ఇప్పటికే ఎల్ నినో ప్రభావం తో ఇబ్బందులు పడుతున్న రైతులకు విద్యుత్ కోతలు మరింత ఇబ్బందికరంగా మారాయని అని తెలిపారు. విద్యుత్ కోతల కారణంగా పంటలను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలు పక్షపాతం గా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి కమిటీలను మార్చాలని సూచించారు. అనేక మంది పూరిగిడిసెల్లో నివసిస్తున్నప్పటికి వారు ఎల్ త్రి కేటగిరిలో ఉన్నారని వారికి యిండ్లు కేటా యించడం లేదని ,అధికారులతో సర్వే జరిపించి వారికి న్యాయం చేయాలని కోరారు. జగ్గు తండా సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో ఉన్న కేజీబీవీ పాఠశాల,ఎస్టీ హాస్టల్ విధ్యార్ధులు మంచి నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇదే సమస్యపై నామాలపాడు సర్పంచ్ వర్స దీప తమ పంచాయతీ పరిధిలో ఉన్న ఏకలవ్య పాఠశాల విద్యార్థులు కూడా నీటి సమస్యను సంవత్సరాలుగా ఎదుర్కొంటున్నారని దానికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అటవీ శాఖ అధికారులు ఇచ్చిన వివరణ పై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా చర్యలు తీసుకోవద్దని అధికారులకు సూచిం చారు. పోడుభూముల విషయం లోనూ రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని, పోడు భూముల్లో కందకాలు తవ్వడం మొక్కలు నాటకం లాంటి చర్యలు చేపట్ట వద్దని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరా విషయంలో అధికారులు స్థానిక సర్పంచ్ లతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# కేంద్ర నిధుల పనులకు ఏడాదిలోపే బిల్లులు

సర్పంచులు సమావేశంలో ప్రస్తావించారు.

అబ్దుల్లాపూర్‌లో మిషన్ భగీరథ ట్యాంకు ఉన్నప్పటికీ ఇళ్లకు నీటి సరఫరా జరగడం లేదని సర్పంచ్ దడిగే జయలలిత తెలిపారు. సాథ్‌గాం ప్రాంతంలో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని సర్పంచులు కోరగా, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సమావేశంలో మండల ప్రత్యేక అధికారి దయానంద్, ఏపీడీ నాగవర్ధన్, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ సూర్యారావు, ఎంఈవో చంద్రకాంత్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకరరావుతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

# ఇండోర్ స్టేడియం ను అందుబాటులోకి తీసుకురావాలి

● **ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చిన కబడ్డీ అసోసియేషన్ నాయకులు**



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 01 ( జనం సాక్షి ) :** స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో ని శివునిపల్లి శివారు నమిలిగొండ రోడ్లో ఉన్న ఇండోర్ స్టేడియం ను అందుబాటులోకి తీసుకువచ్చి క్రీడాకారులకు న్యాయం చేయాలని జనగామజిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పోగుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య,సహాయ కార్యదర్శి అన్నెపు కుమార్ గురువారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి ని కోరారు. ఇండోర్ స్టేడియం అందుబాటు లోకితీసుకురావాలని కబడ్డీ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ పట్టణంలోని నమిలిగొండ శివా రులోఉన్న ఇండోర్ స్టేడియం గత కొన్ని నెలలుగా వాడుకలో లేనందున డోర్స్, విండోస్,ఇంకా కొన్ని వస్తువులు పూర్తిగా పాడైపోయి ఇండోర్ స్టేడియం మొత్తం శిదిలా వ్యవస్థలో ఉందని అన్నారు. ఈ ఇండోర్ స్టేడియంను పూర్తిగా బాగుచేసి అందుబా టులోకి తీసుకువస్తే మన నియోజకవర్గంలోని క్రీడా కారులందరికి ప్రాక్టీస్ చేసుకోవడానికి అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో జనగామజిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెంటనే స్పందించి తొందరలోనే ఇండోర్ స్టేడియం ను అందుబాటులోకి తీసుకువ స్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.



# సీపీ శ్వేతను కలిసిన వరంగల్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్

**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 01 (జనం సాక్షి) :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా నూతన చైర్మన్ బేతి అశోక్ బాబు ఆధ్వర్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఐపీఎస్ ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాలు, భవిష్యత్‌లో నిర్వహించనున్న కార్యక్రమాల గురించి సీపీ శ్వేత ఐపీఎస్‌తో చర్చించారు. అనంతరం ఆమెను మర్యాదపూర్వకంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ శనబోయిన రాజ్‌కుమార్, ట్రెజరర్ బోల్లం శివ, ఎం.సి. సభ్యులు కుసుమ సత్యనారాయణ, మండల పరిష రాములు, వద్దిరాజు, పుల్లూరి ప్రవీణ్ కుమార్, తిరుపతి రెడ్డి, చొప్పరి సోమయ్య ముల్క ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మండల ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ నూతన కమిటీ ఎంపిక



**పెద్దవంగర అక్టోబర్ 1(జనం సాక్షి )** మండల ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ నూతన కమిటీ ఎంపిక గురువారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ యజమానులు అందరూ కలిసి నూతన కమిటీ అధ్యక్షులుగా పగిడిపాల రమేష్, ఉపాధ్యక్షులుగా బొల్లు బీరన్న, ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో గోపాల్ నాయక్ , సురేష్, దామోదర్, వెంకన్న, అనిల్ లు తదితరులు పాల్గొన్నారు .

# వయోవృద్ధుల అనుభవాలను భావితరాలకు అందించాలి

జిల్లా సంక్షేమ అధికారి రాజమణి మాట్లాడుతూ తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా సంక్షేమ శాఖను సంప్రదించాలని కోరారు. జిల్లా వయోవృద్ధుల కమిటీ సభ్యులు మల్లారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వయోవృద్ధుల పోషణ, సంరక్షణ బాధ్యత కుటుంబ సభ్యులదేనని, వారిని ఎలాంటి ఇబ్బందులకు గురిచేయరాదని కోరారు. ఈ సందర్భంగా గతంలో రైల్వే ప్రయాణాల్లో వయోవృద్ధులకు కల్పించిన 40 శాతం రాయితీని పునరుద్ధరించాలని కోరుతూ జిల్లా వయోవృద్ధుల కమిటీ సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రాయితీ పునరుద్ధరణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టానికి సంబంధించిన గైడ్ పుస్తకాలను ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్లలో వయోవృద్ధుల చట్టాలపై అవగాహన కల్పించే డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. వయోవృద్ధులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లను వయోవృద్ధుల తరఫున శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, ఆర్డీవో నర్సంపేట ఉమారాణి, డీఏఓ ఫణికుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డి, పీడీ డీఆర్డీఏ నాగపద్మజ, జిల్లా వయోవృద్ధుల కమిటీ సభ్యులు మల్లారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీ కడియం కావ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 01 ( జనం సాక్షి ) :** మండలంలోని అక్కపల్లి గూడెం నుండి సుమారు 20 మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం హన్మకొండలోని కనకదుర్గ కాలనిలోని ఎంపి నివాసంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురా లు డాక్టర్ కడియం కావ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలోచేరిన నాయకులకు ఎంపీ డాక్టర్ కడియం కావ్య కాంగ్రెస్ పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లో చేరడానికి అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం పేద ప్రజలకు ఉపయోగపడుతుందని అనడానికి కాంగ్రెస్ పార్టీలోకి జరుగుతున్న చేరికలే నిదర్శన మని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసు కోవడంతోపాటు మనందరం కలిసి నియోజకవర్గా న్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో సత్తా చాటిన ఏటూరునాగారం విద్యార్థులు




**ఏటూరునాగారం, అక్టోబర్ 01(జనంసాక్షి) :** హనుమకొండలోని జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కరాటే స్కూల్ గేమ్స్ క్రీడల సెలెక్షన్స్‌లో ములుగు జిల్లా ఏటూరునాగారానికి చెందిన విద్యార్థులు తమ అద్భుత ప్రతిభతో సత్తా చాటారు. ఏటూరునాగారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన వసంత విశాల్ సాయి యాదవ్, గడ్డం వర్షశ్రీ, కుంట వర్షిత్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మూడు బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. ఈ విజయంతో వీరు ఖమ్మం వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడలకు అధికారికంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కరాటే కోచ్ హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు మరియు ములుగు జిల్లా కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బు ప్రత్యేకంగా అభినందించారు.

# అక్రమ గృహ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ఆర్డీడీకి ఫిర్యాదు

**ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు ఏకు శంకర్ మాదిగ**



**పరకాల, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** పరకాల పట్టణంలోని గొడ్ల అంగడి ముందు, ఇంటి నంబర్ 3-277 వద్ద మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా గృహ నిర్మాణం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ రీజనల్ డైరెక్టర్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారికి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు ఏకు శంకర్ మాదిగ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గురువారం శంకర్ మాదిగ మీడియాతో మాట్లాడుతూ.. సదరు గృహ నిర్మాణానికి సంబంధించిన భవన నిర్మాణ అనుమతులు, ఆమోదిత నిర్మాణ ప్రణాళికకు అనుగుణంగా నిర్మాణం జరుగుతోందా లేదా అనే విషయాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. రోడ్డు ఎఫెక్టెడ్ ఏరియా కింద వదలాల్సిన స్థలాన్ని వదలకుండా నిర్మాణం చేపట్టినట్లు, అలాగే భవనం చుట్టూ నిబంధనల ప్రకారం అవసరమైన ఖాళీ స్థలం లేకుండా నిర్మాణం జరుగుతున్నట్లు స్థానికంగా అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు.




## రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు జెడ్‌పిహెచ్ఎస్ అచలాపూర్ విద్యార్థినులు

**తాండూర్, అక్టోబర్ 01(జనం సాక్షి) :** ఆదిలాబాద్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు జెడ్‌పిహెచ్ఎస్ అచలాపూర్ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ ఏ. సాంబమూర్తి తెలిపారు. నిన్న ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి రెజ్లింగ్ పోటీలలో ఈ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. పోటీలలో విజేతల వివరాలు: అండర్-14 విభాగం: 62 కేజీల విభాగంలో 8వ తరగతి విద్యార్థిని పి. అశ్విత గోల్డ్ మెడల్ సాధించింది. అండర్-17 విభాగం: 42 కేజీల విభాగంలో 10వ తరగతి విద్యార్థిని చౌల్ల హర్షిత, 72 కేజీల విభాగంలో 10వ తరగతి విద్యార్థిని కే. శ్రీవల్లి గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఇతర పతకాలు: 35 కేజీల విభాగంలో 6వ తరగతి విద్యార్థిని నిత్య ప్రసన్న బ్రాంజ్ మెడల్, 45 కేజీల విభాగంలో 7వ తరగతి విద్యార్థిని రమాదేవి సిల్వర్ మెడల్, అలాగే 38 కేజీల విభాగంలో 9వ తరగతి విద్యార్థి అజయ్ సిల్వర్ మెడల్ సాధించారు.



## శ్రమదానం చేసిన సర్పంచ్

### నెన్నెలలో స్వచ్ఛతే సేవ కార్యక్రమం

**నెన్నెల, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** నెన్నెల,గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎండీ ఇబ్రహీం ఆధ్వర్యంలో నెన్నెలలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని సర్పంచ్ ఎండీ ఇబ్రహీం పేర్కొన్నారు. గ్రామ ప్రజలు స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్, వార్డు సభ్యుడు భాస్కర్, మానేపల్లి భీమయ్య, పుదరి అంజన్న, భుక్య తిరుమల్, కృష్ణస్వామి, శ్రీశైలం, బాపులాల్, రాజు, బాపు, తాజ్, మోబిన్, జీవన్, తౌసిఫ్, ఇజ్వాన్, అబ్దుల్ రెహమాన్‌తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నాలో ఆదివాసుల ఐక్యత చాటాలి



**మావల అక్టోబర్ 02( జనం సాక్షి):** ఆదివాసీ సంఘాల జేఏసీ, తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఈ నెల 14న హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ దగ్గర ఆదివాసీ ఆత్మ ఘోష మహ ధర్నాను నిర్వహిస్తున్నట్లు ఆదివాసి నాయకులు తెలిపారు. గురువారం ఆదిలాబాదులోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో పలు విషయాలు వెల్లడించారు. మహా ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రమణాల లక్ష్మయ్య, తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, అక్టోబర్ 14, 2026న నిర్వహించనున్న చలో హైదరాబాద్ ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాధర్నాలో ప్రధానంగా నాలుగు డిమాండ్లపై ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఈ ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఆదిలాబాద్ నుండి ఉమ్మడి ఖమ్మం జిల్లా వరకు ఉన్న ఆదివాసీ ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆదివాసీ సంఘాల జేఏసీ, తుడుం దెబ్బ ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. ఈ విలేఖరుల సమావేశంలో నాయకులు గోడం గణేష్ , తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు పోదేం కృష్ణ ప్రసాద్ , తుడుం దెబ్బ జాతీయ కార్యదర్శి వట్టం కన్నయ్య , తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్క శేషారావు ,తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి గోడం రేణుక,ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక ఇందిరా , ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం గణపతి , తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా డివిజన్ అధ్యక్షులు వెడమా ముకుందరావు , తుడుం దెబ్బ మావల మండల అధ్యక్షుడు మెస్రం కేశవరావు, తుడుం దెబ్బ ఆదిలాబాద్ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



## ఆధునిక సాంకేతికతతో సాగు లాభదాయకం

### కిసాన్ మేళాలో ఎంపీ గోడం నగేష్

### 9,400 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతను వ్యవసాయంతో అనుసంధానం చేసుకుని శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ సూచించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎఫ్ఎఫ్‌సీఎస్ కన్వెన్షన్‌లో ఆత్మ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాను కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఆయన ప్రారంభించారు. రైతులు పంటల ఎంపికలో నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణం, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలు, పంట మార్పిడి, కరవును తట్టుకునే వంగడాలను ప్రోత్సహించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలన్నారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ రబీ సీజన్‌కు రైతులను సన్నద్ధం చేయడంతోపాటు వారి సమస్యల పరిష్కారానికి కిసాన్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే 100 శాతం పూర్తయిందని, ఫార్మర్ రిజిస్ట్రీలో 80 శాతానికి పైగా నమోదు జరిగిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 9,400 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని, మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మేళాలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, సహకార, మత్స్య, అటవీ తదితర శాఖలు స్టాళ్లు ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు, డ్రిప్ సాగు, వ్యవసాయ యంత్రాలు, ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాయి. మహిళా సంఘాలకు మంజూరైన రెండు ట్రాలీ ఆటోలను లబ్ధిదారులకు అందజేశారు. రైతు బీమా కింద రూ.2 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్లు, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సోమ భీంరెడ్డి, వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## బాసర మండల అభివృద్ధికి ఎమ్మెల్యే దిశానిర్దేశం

### పెండింగ్ పనులపై కీలక సమీక్ష




**బాసర, అక్టోబర్ 01(జనంసాక్షి)** ముధోల్ నియోజకవర్గం పరిధిలోని బాసర మండల కేంద్రంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ముధోల్ ఎమ్మెల్యే శ్రీ పవార్ రామారావు పటేల్ హాజరై, మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, వివిధ శాఖల పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, వైద్యం, విద్యుత్, మంచినీటి సరఫరా, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖలకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనాలు, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే, ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకమైన ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి మంజూరయ్యేలా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని, అర్హుల జాబితాలో ఏ ఒక్కరూ మిగిలిపోకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి బాసర మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తాసిల్దార్, ఎంపీడీవో, మండల అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో సీపీ వార్షిక తనిఖీ



**రామకృష్ణాపూర్, అక్టోబర్ 01(జనంసాక్షి) :** మందమర్రి పోలీస్‌స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కేంద్రం, రికార్డులు, సీసీటీఎన్ఎస్ నమోదు, సిబ్బంది బ్యారక్‌ను తనిఖీ చేశారు. 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్‌పై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సింగరేణి పారిశ్రామిక ప్రాంతం కావడంతో దొంగతనాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గతంలో నేరాలకు పాల్పడిన వారిపై నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైతే నిబంధనల ప్రకారం గ్యాంగ్ ఫైళ్లు ప్రారంభించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మందమర్రిని నేర, మాదకద్రవ్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందిస్తూ మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశించారు.



## మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శ

**సారంగాపూర్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** సారంగాపూర్ మండలంలోని ప్యారమూర్, గ్రామానికి చెందిన మోకు లక్ష్మీ, కంకట గ్రామానికి చెందిన పెద్దింటి నాగరావు (విశ్రాంత ఉపాధ్యాయులు) చించొలి ఎం గ్రామానికి చెందిన తాండ్ర ఆదెళ్ళు కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీ అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కొట్ల సొసైటీ చైర్మన్ ఐర నారాయణ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మాధవ్ రావు, మాజీ వైస్ ఎంపీపీ భూమేష్, రొద్ద మారుతీ, మిర్ధ సాయన్న, లింగారెడ్డి, గజానంద్ రావు, మల్లయ్య, జిల్లా నాయకులు, స్థానిక నాయకులు,పాల్గొన్నారు.



## పోలీసు అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**నిర్మల్ బ్యూరో, అక్టోబరు 1: (జనంసాక్షి)** పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు జిల్లా కేంద్రంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. గురువారం డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి శిక్షణను ప్రారంభించారు. దూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ పొందడం ఖర్చుతో కూడుకున్నదని, జిల్లా కేంద్రంలోనే ఈ అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. అభ్యర్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి కష్టపడి చదవాలని సూచించారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా అభ్యర్థులు కృషి చేయాలని తెలిపారు. శిక్షణకు సుమారు 300 మంది నమోదు చేసుకున్నారని, ఉచిత భోజనం, అల్పాహారంతో పాటు బోధనా సామగ్రి, ఫిజికల్ ఈవెంట్స్‌లో శిక్షణ అందిస్తామని చెప్పారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దూర ప్రాంత అభ్యర్థులకు వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సౌర విద్యుత్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

### కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 01(జనంసాక్షి) :** సౌర విద్యుత్ వినియోగంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన క్రింద సౌర విద్యుత్ వినియోగంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని, ఈ పథకం ద్వారా గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇండ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంటును ఏర్పాటు చేసుకోవడంతో ప్రతి నెల 360 యూనిట్ల వరకు విద్యుత్ ను పొందవచ్చని తెలిపారు. సోలార్ వినియోగం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించవచ్చని, అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ అవగాహన పెంచుకొని, సోలార్ విద్యుత్ వినియోగించుకునేలా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత నూతన కార్యవర్గం ఎన్నిక



**కడెం, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** కడెం మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో దుర్గామాత నూతన కార్యవర్గం కమిటీని గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా పిలి రాజేందర్ యాదవ్, క్యాషియర్ గా బుర్ర నరేష్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా దాసరి రాజేష్, దుర్గం ఆనంద్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ గ్రామస్తులు ఇందులో భాగస్వాములై అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో విడిసి మాజీ అధ్యక్షులు ఎస్కే హైమద్, రత్నాల రాజేష్, ఎట్టెం ఎర్రన్న, రెడ్డి నరసయ్య, కుంటాల నరేందర్,రాము గౌడ్, సంగం శేఖర్ పటేల్, పిలి రాజు, బుర్ర గంగన్న గౌడ్, పోష గౌడ్, సిహెచ్ గంగన్న, లచ్చన్న, అంజన్న, అంజన్న గోని, మహిపాల్, రవి, మల్లికార్జున్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు వచ్చే పిల్లలకు సమతుల్య పౌష్టికాహారం అందించాలి

### కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 01(జనంసాక్షి ):**

జిల్లాలోని అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పిల్లలకు సమతుల్యమైన పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గల అంగన్వాడీ కేంద్రంలో చేపట్టిన తొలిముద్ద అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మెంగ్రే ఆకాష్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే 3 - 6 సంవత్సరాల వయసు గల పిల్లలకు సమతుల్య పౌష్టిక ఆహారం అందించి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తల్లులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి తొలిముద్ద అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు ఉప్మా, కిచిడీతో కూడిన అల్పాహారాన్ని అందించి తినిపించారు. అనంతరం జనకాపూర్ లోని రైతు వేదికలో పోషణ మాసంలో భాగంగా ఏర్పాటు చేసిన గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ



మహిళలు, గర్భిణుల సంక్షేమం కొరకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వినియోగించుకోవాలని, అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టిక ఆహారం సకాలంలో తీసుకోవాలని తెలిపారు. పరిశుభ్రత, ఆరోగ్య రక్షణ, ప్రారంభ విద్యపై మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, కౌన్సిలర్ కొండు భారతి, ఐ సి డి ఎస్ సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

# యూరియా బస్తాపై అదనపు వసూళ్లు

### నిలువు దోపిడీకి గురవుతున్న రైతులు




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 01(జనంసాక్షి) :**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) కేంద్రాల్లో యూరియా కోసం వచ్చే రైతులపై అదనపు భారం పడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరకు యూరియా బస్తా అందించాల్సి ఉండగా, కొన్నిచోట్ల బస్తాకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా బస్తాపై ఎమ్మార్పీ రూ.266గా ఉన్నప్పటికీ, కొందరు పి ఏ సి ఎస్ కేంద్రాల్లో రూ.330 వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు రైతుల నుంచి వస్తున్నాయి. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్న రైతులకు బస్తాకు అదనపు మొత్తం మరింత భారంగా మారుతోందని వారు వాపోతున్నారు.

**అధికారులు ఉన్నా.. చర్యలు ఎక్కడ?**

పిఏసిఎస్ కేంద్రాల్లో యూరియా విక్రయాలు జరుగుతున్న తీరుపై సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ, రైతుల నుంచి అదనపు వసూళ్ల ఆరోపణలు వస్తున్నా అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల స్థాయిలో తనిఖీలు నిర్వహించి, యూరియా విక్రయ ధరలు, స్టాక్ వివరాలు, రైతులకు ఇచ్చే బిల్లులను పరిశీలించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు..

**బిల్లు ఇస్తున్నారా.. అదనపు వసూళ్లకు లెక్కేంటి?**

యూరియా కొనుగోలు చేసిన ప్రతి రైతుకు సరైన బిల్లు, రసీదు ఇవ్వడంతో పాటు విక్రయ ధర స్పష్టంగా ఉండాలని రైతులు కోరుతున్నారు. ఎమ్మార్పీ కంటే అదనంగా వసూలు చేస్తున్నట్లయితే దానికి అధికారిక రసీదు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ఎంత? పి ఎ సి ఎస్ కేంద్రంలో రైతు చెల్లించాల్సిన అసలు ధర ఎంత? అదనంగా వసూలు చేస్తున్న మొత్తం ఎక్కడికి వెళ్తోంది?" అనే ప్రశ్నలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

రెబ్బెన మండలంలోని అన్ని పి ఎ సిఎస్ కేంద్రాల్లో యూరియా విక్రయాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, ఎమ్మార్పీ ధరకు మాత్రమే యూరియా విక్రయించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అదనపు వసూళ్లు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# జిల్లాస్థాయి కిసాన్ మేళాలో ఆధునిక సాగు మెళకువలపై అవగాహన

### ప్రత్యేక బస్సుల్లో తరలిన రైతులు

**బాసర, అక్టోబర్ 01(జనంసాక్షి) :** జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న కిసాన్ మేళాకు బాసర మండల రైతులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎఫ్ ఎన్ సీసీ కన్వెన్షన్ హాల్ (ఎఫ్ ఎన్ సీసీ కన్వెన్షన్ హాల్) లో ఈ కిసాన్ మేళా



నిర్వహిస్తున్నారు.ఈ మేళాకు బాసర మండలంలోని వివిధ గ్రామాల నుండి రైతులు, మహిళా రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రైతుల సౌకర్యార్థం వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేయగా, ఆ బస్సుల్లో రైతులు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. బయలుదేరే ముందు బాసరలో రైతులు గ్రూప్ ఫోటో తీసుకున్నారు.ఈ సందర్భంగా బాసర మండల వ్యవసాయ విస్తరణ అధికారి హదసా మాట్లాడుతూ, జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో రైతులకు అనేక అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా.. ఆధునిక సాగు పద్ధతులు, నూతన వ్యవసాయ సాంకేతికత, యాంత్రీకరణ,అనుబంధ వ్యవసాయం ద్వారా అదనపు ఆదాయ మార్గాలు, వంటల సాగు మెళకువలు,ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సంక్షేమ పథకాలు, పంటల బీమా పథకాలపై రైతులకు వివరంగా వివరిస్తున్నామని తెలిపారు.కిసాన్ మేళాలో ఆధునిక వ్యవసాయ యంత్రాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల వాడకంపై స్టాళ్లు ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా రైతులకు చూపిస్తున్నారని, ఈ మేళా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



## రాష్ట్రస్థాయి అండర్ 19 ఎస్జిఎఫ్ చెస్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ఎంపిక

**బెల్లంపల్లి, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంట్రల్ ఎక్సలెన్సీ బెల్లంపల్లిలో గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి అండర్ 19 చెస్ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు అండర్ 19 ఎస్జిఎఫ్ సెక్రటరీ బి బాబు రావు, ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్, డీఐఈఓ అంజయ్య తెలిపారు. రాష్ట్రస్థాయి ఎంపికైన విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్ మాట్లాడుతూ చెస్ అనేది ఒక మైండ్ గేమ్ అని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. అనంతరం ఎస్జీఎఫ్ అండర్ 19 ఉమ్మడి అదిలాబాద్ సెక్రటరీ బి బాబు రావు మాట్లాడుతూ చెస్ కి రాష్ట్రస్థాయి ఎంపికైన విద్యార్థులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఈ కనకయ్య విద్యార్థులకు చెస్ ఆటతో చాలా విషయాలు సులభంగా అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తన్నీరు గోపి, సూపర్డెంట్ రాజశేఖర్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, ముత్యకుర్తి రాజశేఖర్, విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు.



## వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు బాధ్యతగా కృషి చేయాలి

### కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 01(జనంసాక్షి) :** వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్ లో గల విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయంలో వృద్ధుల కోసం ఏర్పాటుచేసిన న్యాయ అవగాహన కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూప రాణి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు, ఉచిత న్యాయ సహాయం, వృద్ధుల సంక్షేమానికి సంబంధించిన చట్టాలపై వృద్ధులు అవగాహన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వృద్ధులకు ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం కోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 14567కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రతినిధి కరుణాకర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అంజనీదేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలాలకు దారి చూపించాలి




తహసీల్దార్‌కు సింగరేణి విశ్రాంత కార్మికుల వినతి

**రెబ్బెన,అక్టోబర్01(జనంసాక్షి) :** గోలేటి క్రాస్‌రోడ్ వద్ద ప్లాట్లు కొనుగోలు చేసిన సింగరేణి విశ్రాంత కార్మికులకు ఇళ్ల నిర్మాణం కోసం 20 అడుగుల రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ గురువారం రెబ్బెన తహసీల్దార్ సూర్యప్రకాశ్‌కు సింగరేణి వాలంటరీ రిటైర్మెంట్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు బూడిద గోపాలకృష్ణ మాట్లాడుతూ.. 2005లో సుమారు 60 మంది విశ్రాంత కార్మికులు గోలేటి క్రాస్‌రోడ్ వద్ద ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. సర్వే, నాలా ధ్రువపత్రాలు పొందినా ఇళ్ల నిర్మాణానికి రహదారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ప్లాట్లకు వెళ్లే మార్గంలో సింగరేణి అధికారులు సిమెంట్ పిల్లర్లు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో గత మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామపంచాయతీ, సింగరేణి అధికారులకు పలుమార్లు వినతులు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. రహదారితో పాటు బోర్‌వెల్, వీధి దీపాలు, విద్యుత్ స్తంభం తొలగింపు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కోరుట్ల యాదగిరి, మాటూరు లక్ష్మీనారాయణ, కంకటి శంకర్ పాల్గొన్నారు.



## రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయాలలో ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ- మంచిర్యాల జిల్లా రక్త నిధి కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... రక్తదానం చేయడం ద్వారా తలసేమియా, సికిల్ సెల్, రక్తహీనత వంటి వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు ప్రమాదాలలో గాయపడి అత్యవసరంగా రక్తం కావలసి ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. రక్త నిధి కేంద్రానికి రక్తదాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యా సంస్థలు, సింగరేణి సంస్థ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల యాజమాన్యాలు, స్వచ్ఛంద రక్తదాన శిబిరాల నిర్వాహకులు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తాన్ని అందిస్తూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న అనేక మంది ప్రాణాలను కాపాడటంలో రక్తదాతల సహకారం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. యువత, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని, రక్తదానం ద్వారా అత్యవసర సమయంలో ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అనంతరం అత్యధిక సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన రక్తదాతలు, ప్లేట్లెట్స్ దానం చేసిన స్వచ్ఛంద రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా ప్రతినిధులు, సిబ్బంది, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి ఏరియాలో 130 శాతం బొగ్గు ఉత్పత్తి



**రామకృష్ణాపూర్, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** మందమర్రి ఏరియా సెప్టెంబర్ నెలలో నిర్దేశిత లక్ష్యంలో 130 శాతం బొగ్గు ఉత్పత్తి, 105 శాతం ఓవర్ బర్డెన్ తొలగింపు సాధించిందని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఉత్పత్తి, ఉత్పాదకత, కార్మిక సంక్షేమ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. భూగర్భ గనుల్లో ఉద్యోగుల గైర్హాజరు కారణంగా ఉత్పత్తికి అంతరాయం కలగకుండా యూనియన్ నాయకులతో సమన్వయంతో చర్యలు చేపడుతున్నామన్నారు. ఓసీపీల్లో బ్లాస్టింగ్ సమయంలో గ్రౌండ్ వైబ్రేషన్, శబ్దం సురక్షిత పరిమితుల్లో ఉండేలా ఇంజినీర్లు డిజైన్ చేస్తున్నారని తెలిపారు. ఫ్లై రాక్స్ నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూనే ఉత్పత్తి కొనసాగిస్తున్నామని చెప్పారు. మహిళలు, యువతీ యువకులకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషన్, కంప్యూటర్ శిక్షణ తరగతులను ఈ నెలలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రామకృష్ణాపురం ఓసీపీని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. అధికారులు, కార్మికుల సహకారంతో భూగర్భ గనుల్లో 100 శాతం ఉత్పత్తి సాధించడంతోపాటు భద్రత, నాణ్యతతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని కోరారు. ప్రతి నెలా వెల్ఫేర్, పర్సనల్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేకే ఏజెంట్ ఖాదిర్, కేకేఓసీ ప్రాజెక్టు అధికారి రాంబాబు, ఏరియా ఇంజనీర్ ఈఅండ్ఎం బాలాజీ భగవతి, డీజీఎం పర్సనల్ సీహెచ్.అశోక్, డీజీఎం ఐఈడీ కిరణ్‌కుమార్, సీనియర్ పీవో కార్తీక్ పాల్గొన్నారు.



## కుంటాల మండల కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధుడు 'వడ్డే ఓబన్న' విగ్రహ ప్రతిష్టాపనకు భూమిపూజ

**కుంటాల, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు,విప్లవ వీరుడు వడ్డే ఓబన్న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి వైభవంగా భూమిపూజ నిర్వహించారు. స్థానిక వడ్డెర సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జక్కుల గజేందర్ ముఖ్య అతిథిగా హాజరై, భూమిపూజ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు వడ్డే ఓబన్న అని, ఆయన స్మారకార్థం కుంటాలలో విగ్రహాన్ని ప్రతిష్టించడం గర్వకారణమని పేర్కొన్నారు.విగ్రహ ప్రతిష్టాపన కోసం మండల కేంద్రంలో స్థలాన్ని కేటాయించినందుకు గ్రామ సర్పంచ్ జక్కుల గజేందర్, గ్రామ పాలకవర్గ సభ్యులకు, గ్రామ పెద్దలకు కుంటాల వడ్డెర సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



18

క్రిటికల్ కేర్‌పై విష ప్రచారం మానుకోవాలి

నిర్మల్ టౌన్, అక్టోబర్ 01 (జనంసాక్షి) : క్రిటికల్ కేర్ సెంటర్‌పై మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అసత్య ప్రచారం మానుకోవాలని బీజేపీ నాయకులు అన్నారు. కేంద్రం రూ.23.74 కోట్లతో మంజూరు చేసిన ఈ ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చొరవతో వేగవంతం చేశామని తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, ఫర్నిచర్, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రారంభ తేదీ నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. వ్యక్తిగత విమర్శలు చేయకుండా ఆసుపత్రి పూర్తికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఇంద్రకరణ్‌రెడ్డికి సూచించారు. లేనిపక్షంలో



# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, పారిశుధ్య, సంక్షేమ, విద్యా కార్యక్రమాల నిర్వహణను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... మంచిర్యాల మార్కెట్ ప్రాంతంలో కొనసాగుతున్న నగరాభివృద్ధి పనులను ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని తెలిపారు. గోదావరి పుష్కర ఘాట్ ప్రాంతాన్ని సందర్శించి అభివృద్ధి పనుల కోసం గుర్తించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజలకు, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేలా ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యటనలో భాగంగా ఒక ఇంటి వద్ద నీరు వృథాగా పోతుండటాన్ని గమనించి నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాజు, మున్సిపల్ డిప్యూటీ ఈఈ, మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కంది విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన సదస్సు




**కెరమెరి,అక్టోబర్ 1(జనంసాక్షి) :**

కెరమెరి, వాంకిడి, ఆసిఫాబాద్ మండలాల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో, జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు ఆర్థిక సహకారంతో రైతులకు కంది విత్తనోత్పత్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం నాడు నిర్వహించిన సదస్సుకు కెరమెరి సహకార సంఘం సంచాలకులు షేక్ మహమ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా. ఎం. మధు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు వస్తాయన్నారు. విత్తనోత్పత్తిలో పాటించాల్సిన ఎడబాటు దూరం, కల్తీ మొక్కల ఏరివేత, కలుపు నివారణపై రైతులకు వివరించారు. పంటలో వచ్చే మచ్చల పురుగు, కాయతొలిచే పురుగు, కాయ ఈగ నివారణపై సూచనలు ఇచ్చారు. సహకార సంఘం సంచాలకులు మాట్లాడుతూ రైతులు స్వయంగా విత్తనోత్పత్తి చేపడితే సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. అభ్యుదయ రైతు బాలాజీ, ధనోరా సర్పంచ్ సిడాం గంగు మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రభావతి, సహకార సంఘాల ముఖ్య కార్యనిర్వహణాధికారులు రమణ, ఓమాజీ, విజయ్, 40 మంది రైతులు పాల్గొన్నారు.

# జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లాలోని అడ ప్రాజెక్టు ప్రాంతాన్ని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సహజ వనరులు, జలవనరులు, ప్రకృతి అందాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు సందర్శకులను ఆకర్షించేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. అడ ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మెరుగుపడటంతో పాటు జిల్లాకు పర్యాటకుల రాక పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. పర్యాటకుల కొరకు వ్యూయింగ్ పాయింట్లు, వాకింగ్ ట్రాక్‌లు, పార్కింగ్, త్రాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, విశ్రాంతి ప్రదేశాలు, సమాచార కేంద్రం, సుందరీకరణ, లైటింగ్ తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతి కలిగేలా ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలి

## వామపక్ష పార్టీల డిమాండ్



**బెల్లంపల్లి, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే ఆపదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గురువారం బెల్లంపల్లి పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు వామపక్ష పార్టీలు ధర్నా చేపట్టాయి. అనంతరం సబ్ కలెక్టర్ మనోజ్ కు వినతిపత్రాన్ని అందజేశారు. దేశంలో జరుగుతున్న స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియ నిలిపివేసి, ఈ ప్రక్రియలో ఓటు హక్కు కోల్పోయిన అర్హులందరికీ ఓటు హక్కును పునరుద్ధరించాలని కోరారు. సిపిఐ, సిపిఐఎం, ఎంసిపిఐయూ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, లెఫ్ట్ వామపక్షాల నాయకులు దాగం మల్లేష్, ఆడెపు రాజమౌళి, పసులేటి వెంకటేష్, దాగం శ్రీకాంత్, రెడ్డి చరణ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి అర్హత కలిగిన పౌరుడికి ఎన్నికల్లో ఓటు వేసే హక్కును కల్పించిందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు, అయితే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో చేపడుతున్న ప్రక్రియలో అర్హత కలిగిన అనేకమంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించబడుతున్నాయని ఆందోళనలు వ్యక్తం చేశారు. భారత ఎన్నికల సంఘం స్వయంగా సర్ యొక్క ప్రధాన లక్ష్యం అర్హులైన పౌరులు ఎవరు ఓటర్ల జాబితా నుంచి తొలగింపకూడదు అని పేర్కొంది. అయినప్పటికీ పత్రాల సమర్పణ, ధ్రువీకరణ, చిరునామా, మార్పులు, వలసలు, సాంకేతిక సమస్యలు తదితర కారణాలతో అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతే అది ప్రజా సామ్య హక్కులపై తీవ్ర ప్రభావం చూపే అంశంగా భావిస్తున్నాం అన్నారు. ఓటర్ల జాబితాపై ఇష్టానుసరంగా వ్యవహరించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని లేకుంటే, ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, సిపిఎం జిల్లా సమితి సభ్యులు దాగం శ్రీకాంత్, ఎంసిపిఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసుపులేటి వెంకటేష్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బొల్లం సోని, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రెడ్డి చరణ్, భూమయ్య, సిపిఐ బెల్లంపల్లి పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, బికేయంయు జాతీయ సమితి సభ్యుడు అక్కెపల్లి బాబు, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, తాండూరు మండల కార్యదర్శి కొండు బానేష్, బికేయంయు జిల్లా కార్యదర్శి గుండాచంద్ర మాణిక్యం, సిపిఐ జిల్లా సమితి సభ్యులు డిఆర్ శ్రీధర్, మేకల రాజేశం, రత్నం రాజ్యం, సిపిఐ నాయకులు బోర్ల సమ్మయ్య, ప్రహ్లాద్, ఆరేపల్లి రమేష్, స్వామి దాస్, కే తిరుపతి, మహేందర్ రెడ్డి, అందుగుల రాజేందర్, మేకల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరిస్తోంది

## భూక్య జాన్సన్ నాయక్



**ఖానాపూర్ అక్టోబర్ 01 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభలు ఏర్పాటు చేసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను, ప్రతిపక్ష నాయకులను తిట్టడానికే ప్రాధాన్యమిస్తున్నారే తప్ప, రాష్ట్ర అభివృద్ధిని, ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. ప్రజల సొమ్మును సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాల్సిన ప్రభుత్వం, రాజకీయ విమర్శల సభల కోసం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన నిలదీశారు.?అధికారంలోకి వచ్చి 1000 రోజులు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరిస్తోందని, నిరంతరం గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. నిన్న సిరిసిల్లలో వేలాది మంది పోలీసుల బందోబస్తు నడుమ కోట్లు ఖర్చు చేసి నిర్వహించిన సభ కేవలం కేటీఆర్‌ను విమర్శించడానికే పరిమితమైందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలోనైనా, మీడియా ముఖంగానైనా ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి ప్రణాళికలు వివరించకుండా కేవలం రాజకీయ ఆరోపణలకే ప్రాధాన్యమిస్తున్నారని మండిపడ్డారు. రైతులు, యువత, నిరుద్యోగులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యక్తిగత విమర్శలు స్వస్తి చెప్పి, ఎన్నికల హామీల అమలు, రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని భూక్యా జాన్సన్ నాయక్ హితవు పలికారు.

# వయోవృద్ధులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 1, జనంసాక్షి**

వయోవృద్ధులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి, వయోవృద్ధుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మాట్లాడుతూ... సమాజంలో వస్తున్న మార్పులపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, వయోవృద్ధుల అనుభవం, వారి సలహాలు, సూచనలు సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు తమ ఆస్తులు, భూములను పిల్లలకు బదలాయించిన అనంతరం నిర్లక్ష్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్తిపాస్తులు లేని వయోవృద్ధులను వారి పిల్లలు బాధ్యతగా చూసుకోవాలని తెలిపారు. వయోవృద్ధులు సమాజానికి విలువైన సంపద అని, కుటుంబానికి పెద్దలుగా వారు అందించే అనుభవం సమాజానికి కూడా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వయోవృద్ధుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత ముఖ్యమని, వయోవృద్ధులు క్రమం తప్పకుండా నడక, యోగా వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలను కొనసాగించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాల ద్వారా వయోవృద్ధులకు రక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో చట్టాన్ని అమలు చేయడం, గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సుమారు 35 వేల 250 మంది వయోవృద్ధులు వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారని, ప్రతి నెలా పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా సంఘాల ప్రతినిధులు గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వయోవృద్ధుల హక్కులు, సంక్షేమంపై సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులు హాజరు శాతం పెంపొందించాలి



## కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 01(జనంసాక్షి ):** ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల హాజరు శాతం పెంపొందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి లతో కలిసి మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానమంత్రి శ్రీ పాఠశాలల ఉపాధ్యాయులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రిన్సిపాల్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ లో జిల్లా ర్యాంకు తక్కువగా ఉందని, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం తక్కువగా నమోదు అయిందని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన, ప్రతి పాఠశాలలో మూత్రశాలలు, త్రాగునీటి సౌకర్యం వంటి వివరాలను యు డైస్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. కొన్ని పాఠశాలలలో తరచుగా అనుమతి లేకుండా పాఠశాలలకు గైర్హాజరు అవుతున్న ఉపాధ్యాయులను గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తెలిపారు. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలను తరచుగా సందర్శించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించాలని, సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రణాళికా సమన్వయకర్తలు శ్రీనివాస్, అబిద్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 30 లక్షల ప్రమాద బీమా చెల్లించాలని యూనియన్ బ్యాంక్ ఎదుట రిటైర్డ్ సింగరేణి కార్మికుల ధర్నా

## సానుకూలంగా స్పందించిన యూనియన్ బ్యాంకు మేనేజర్

**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 1 (జనంసాక్షి) :** సింగరేణిలో పనిచేసి రిటైర్డ్ అయి యూనియన్ బ్యాంకు లో ఖాతా కలిగిన సింగరేణి రిటైర్డ్ కార్మికులకు 30 లక్షల ప్రమాద బీమా చెల్లించాలని సింగరేణి రిటైర్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. గురువారం నాడు మంచిర్యాల జిల్లా మందమర్రి యూనియన్ బ్యాంక్ ఎదుట సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ లో ఖాతాలు కలిగిన 70 సంవత్సరాల లోపు పెన్షన్ దారులకు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి బరోసా గా 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని 2004 లో సింగరేణి కంపెనీ , యూనియన్ బ్యాంక్ యాజమాన్యం తో చేసుకున్న ఒప్పందం మేరకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాల్సిన నిబంధన ఉన్నప్పటికీ కొందరు యూనియన్ బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నందున నిరసన గా నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ ఖాత దారులకు 30 లక్షల ప్రమాద బీమా కల్పించాలని మందమర్రి బ్యాంకు మేనేజర్ వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం పై సానుకూలంగా స్పందించి మందమర్రి యూనియన్ బ్యాంక్ లో ఖాతాలు కలిగి ఉన్న 70 సంవత్సరాల లోపు సింగరేణి బొగ్గు పెన్షన్ దారులకు ప్రమాదవాశాత్తు మరణిస్తే ఒప్పందం మేరకు వారి కుటుంబానికి 30 లక్షల ప్రమాద బీమా చెల్లిస్తామని మేనేజర్ గారు హామీ ఇవ్వడం పట్ల సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేస్తూ , మేనేజర్ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా మందమర్రి యూనియన్ బ్యాంక్ లో వయో వృద్ధులకు, సీనియర్ సిటిజన్లకు సెపరేట్ గా కౌంటర్ ఏర్పాటు చేయాలని , వాష్రూమ్స్ కూడా ఏర్పాటు చేయాలని మేనేజర్ గారి దృష్టి కి తీసుకుపోయిన వెంటనే సానుకూలంగా స్పందించడం జరిగిందని మేనేజర్ మరొకసారి సింగరేణి పెన్షన్ దారుల తరుపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సింగరేణి కార్మికుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, మందమర్రి ఏరియా నాయకుడు రాం రవేందర్ , ఆర్ కొమురయ్య , మడవాని శంకర్ , బచ్చల భీమయ్య , సిఎచ్ నారాయణ , ఎన్ శివానందన్ , పి సమయ్య , శ్రీరాంపూర్ ఏరియా నాయకులు దండు రాజమౌళి , కేంద్ర కమిటీ నాయకుడు పోతురాజుల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

## డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క





**కెరమెరి,అక్టోబర్ 1 (జనంసాక్షి) :** జోడేఘాట్ ఆశ్రమ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తూ ఇటీవల వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తు గల్లంతై మృతి చెందిన దుర్వ శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క భరోసా ఇచ్చారు. గురువారం సాకడ గ్రామంలో నిర్వహించిన దుర్వ శ్రీనివాస్ దశదినకర్మ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన ఆకస్మిక మృతి కుటుంబ సభ్యులతో పాటు విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులను తీవ్ర విషాదంలోకి నెట్టిందన్నారు. బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పించడంతో పాటు ప్రభుత్వం నుండి అందాల్సిన సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ సుజాహిత్ ఖాన్, ఇందిరా ఫెలోషిప్ జిల్లా అధ్యక్షురాలు కోవ ఇందిరా, కెరమెరి సర్పంచ్ పెందూర్ ఆనందరావు, మాజీ ఎంపీపీ పెందూర్ మోతీరాం, సీనియర్ నాయకులు మొహర్లే బాపురావు, సాయి, రాము, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడి కుటుంబానికి పీఆర్టీయు లక్ష రూపాయల ఆర్థిక సాయం





**కెరమెరి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) :** జోడేఘాట్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న దుర్వ శ్రీనివాస్ ఇటీవల ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందారు. ఆయన పీఆర్టీయూ టీఎస్ సంఘం ప్రాథమిక సభ్యుడు కావడంతో, సంఘం రాష్ట్ర సంక్షేమ నిధి నుండి ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని గురువారం ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. జిల్లా అధ్యక్షులు ఆడె ప్రకాష్ చేతుల మీదుగా ఈ సహాయాన్ని అందజేసి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, మండల, జిల్లా మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాదవ్ రవీందర్, చునార్కర్ భరత్, కుర్సెంగా సోము, రాథోడ్ ప్రకాష్, ఏ.ధన్లాల్, జే.శ్రీనివాస్, ఏ.మాధవ్,ఏ. అమర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# క్రిటికల్ కేర్‌పై విష ప్రచారం మానుకోవాలి

**నిర్మల్ టౌన్, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** క్రిటికల్ కేర్ సెంటర్‌పై మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అసత్య ప్రచారం మానుకోవాలని బీజేపీ నాయకులు అన్నారు. కేంద్రం రూ.23.74 కోట్లతో మంజూరు చేసిన ఈ ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చొరవతో వేగవంతం చేశామని తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, ఫర్నిచర్, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రారంభ తేదీ నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. వ్యక్తిగత విమర్శలు చేయకుండా ఆసుపత్రి పూర్తికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఇంద్రకరణ్‌రెడ్డికి సూచించారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



## విద్యార్థుల్లో సమానత్వం పెంపొందించడమే లక్ష్యం

**నిర్మల్, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** విద్యార్థుల్లో సమానత్వ భావన, క్రమశిక్షణ పెంపొందించడంతో పాటు వారికి సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ ఉచిత యూనిఫార్ముల పంపిణీ ఉద్దేశమని లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. కళాశాలలో గురువారం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత యూనిఫార్ములను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు యూనిఫార్ములను క్రమశిక్షణతో ధరించి కళాశాలకు రావాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల అవసరాలను గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 24 అగ్రిమెంట్లు సాధించింది ఏఐటీయూసీనే..

### వాసిరెడ్డి, రాజ్ కుమార్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** సింగరేణిలో 24 అగ్రిమెంట్లు సాధించిన ఘనత ఏఐటీయూసీ గుర్తింపు సంఘానిదేనని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. భూపాలపల్లిలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ టీబీజీకేఎస్ తొమ్మిదేళ్లు సమస్యలు పెండింగ్ లో పెట్టిందని విమర్శించారు. మెడికల్ బోర్డు, పెర్క్స్ పై పన్ను రద్దు, సొంతింటి కల వంటి అంశాలపై పోరాడామని, తాడిచెర్ల ఓసీ-2 సాధించామని, పీవీఎన్ఆర్ ఓసీ రాబోతుందని తెలిపారు. లాభాల వాటా, దీపావళి బోనస్ పై ఈ నెల 3న ఆర్ఎల్సీ సమావేశం తర్వాత ప్రకటన వస్తుందని చెప్పారు.

## చెరువుకొమ్ము తండాలో ఉచిత వైద్య శిబిరం



**చెన్నారావుపేట, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** మండలంలోని చెరువు కొమ్ము తండా గ్రామంలో గ్రామ సర్పంచ్ భూక్య మహబూబ్ సింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చెన్నారావు పేట వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సరోజ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో ఉన్న సీజనల్ వ్యాధుల పట్ల గ్రామ ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సర్పంచ్ మహబూబ్ సింగ్ రాథోడ్ మాట్లాడుతూ ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత డాక్టర్లను సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, సూపర్వైజర్ కీర్య, హెల్త్ అసిస్టెంట్లు శివాజీ, సురేందర్, ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్లు సునీత, ఉమ, వార్డు సభ్యులు గ్రామస్తులు, జిపి సిబ్బంది, పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో సిరంజీల కొరత

### ఆసుపత్రికి సిరంజిలను అందజేసిన బిఆర్ఎస్ నాయకులు



**మంగపేట, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో చికిత్స కోసం వచ్చే రోగులకు చికిత్సకి అవసరమయ్యే సిరంజీలు అందుబాటులో లేకపోవడం బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల శాఖ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆయన ఆసుపత్రిని పరిశీలించగా సిరంజీ ల కొరత తీవ్రంగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందని ఈ విషయాన్ని వెంటనే బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన నాగజ్యోతి తక్షణమే చికిత్స కొరకు సిరంజీలను అందించాలని తెలపగా కుడుముల లక్ష్మీనారాయణ ఆసుపత్రికి సిరంజీలను అందజేశారు. ఈ సందర్భంగా కుడుముల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర చికిత్సకు కావలసిన కనీస సిరంజీలు కూడా లేకపోవడం తీవ్ర విచారకరమన్నారు. పేద ప్రజలు పూర్తిగా ప్రభుత్వ వైద్యం పైనే ఆధారపడుతున్నందున, వారికి అవసరమైన మందులు, వైద్య సామాగ్రి ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తాము నిర్వహిస్తున్నది ప్రజా పాలన అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, కనీసం పేదలకు ప్రాథమిక వైద్య సదుపాయాలు కూడా కల్పించలేకపోతోంది అని ఆయన ఎద్దేవా చేశారు. ఆసుపత్రుల్లో ఇలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా వైద్యాధికారులు తక్షణమే స్పందించాలి అని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు భూట్టో, దంతనపల్లి నరేందర్, గుడివాడ శ్రీహరి, అలీమోద్దీన్ సయ్యద్, గోర యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# కాజిపేట వైఎస్ఆర్ నగర్ గుడిసెవాసులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

### 22 ఏళ్లుగా నివసిస్తున్న పేదలకు పట్టాలు, ఇళ్లు మంజూరు చేయాలి

### కాజీపేటలో భారీ ర్యాలీ



**కాజిపేట, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** వైఎస్ఆర్ నగర్ గుడిసెవాసులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని, పేదల పక్షాన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని కోరుతూ వైఎస్ఆర్ నగర్ వీకర్ సెక్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రెవెన్యూ మరియు హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వీకర్ సెక్షన్ అసోసియేషన్ అధ్యక్షులు పసనూరి మనోహర్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అంకుస్ పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అంకుస్, పసనూరి మనోహర్ మాట్లాడుతూ.. కాజిపేట వైఎస్ఆర్ నగర్‌లో సుమారు 22 ఏళ్లుగా పేద కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వమే ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, పాన్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు, ఇంటి నంబర్లు, ఓటర్ ఐడీ కార్డులు వంటి ప్రభుత్వ గుర్తింపు పత్రాలు ఇచ్చారు. సర్వే నంబర్లు 69, 70, 71, 72, 73 పరిధిలోని భూమికి సంబంధించి పేదలు ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారని, గతంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరుతో వైఎస్ఆర్ నగర్‌గా నామకరణం చేసి, అప్పటి కార్పొరేటర్ రావుల సదానందం నాయకత్వంలో సుమారు వెయ్యి కుటుంబాలు ఇక్కడ నివాసం ఏర్పరుచుకున్నాయని తెలిపారు. అయితే గత మూడు నెలలుగా కొందరు భూ కబ్జాదారులు ఈ భూమిపై కన్నేసి, పేదలను భయభ్రాంతులకు గురిచేస్తూ గుడిసెలను తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పేదల గుడిసెలను తొలగించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని వారు హెచ్చరించారు. ఇటీవల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రభుత్వ లేదా సీలింగ్ భూముల్లో ఏళ్ల తరబడి నివసిస్తున్న పేదలకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని, వారికి పట్టాలు కల్పించి ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే కార్యక్రమంలో భాగంగా, స్థిర నివాస స్థలాలు లేని పేదలకు ప్రభుత్వం భూమి సమకూర్చి లేదా అవసరమైతే భూమి కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

# మాదిగలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలి

### డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల మాదిగకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలి

### ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్



**ఆత్మకూరు, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** మాదిగ సామాజిక వర్గానికి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరు మండలంలోని నాగయ్యపల్లిలో ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి ఉన్న రెండు స్థానాల్లో కనీసం ఒక్క స్థానమైనా మాదిగలకు కేటాయిస్తారని ఆశించామని,అయితే ఆ అవకాశం రాలేదని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటాలో మాదిగలకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరారు. డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ విద్యావంతుడు, రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు, ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న వ్యక్తి అని తెలిపారు. తాతముత్తాతల నుంచి కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉన్న కుటుంబానికి చెందిన రామకృష్ణ, దీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని పేర్కొన్నారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా డాక్టర్ రామకృష్ణకు అవకాశం వస్తుందని ఆశించామని, కానీ అవకాశం దక్కలేదని అన్నారు. ఇప్పుడు గవర్నర్ కోటాలో ఆయనకు ఎమ్మెల్సీ అవకాశం కల్పిస్తే వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల కోసం మరింత విస్తృతంగా పనిచేస్తారని మాదాసి సురేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. మాదిగల రాజకీయ ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ డీపీఎఫ్ జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్, ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బాగాజీ రజనీకాంత్,ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మాదాసి ప్రభాకర్ మాదిగ, మాజీ ఉపసర్పంచ్ సంగి యాకయ్య, మాజీ వార్డ్ సభ్యులు మాదాసి అశోక్, బోడళ్ల సాంబయ్య,ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి డాక్టర్ సుధాకర్ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద రక్తదానం - ప్రాణదానంతో సమానం

## ర్యాలీని ప్రారంభించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య



జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన ర్యాలీ, స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలోని పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం వద్ద ప్రారంభమైన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జెండా ఊపి ప్రారంభించారు. కుమార్‌పల్లి మీదుగా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన ఆవశ్యకతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ, రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయంలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందించి వారి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ఇది ఒక గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. 18 సం.ల నుండి 60 సం.ల వయస్సు గల వారు రక్త దానం చేయాలి. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అధికారులు స్వచ్ఛంద రక్తదాన ప్రతిజ్ఞ చేశారు. ఆ తర్వాత ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 15 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మదన్ మోహన్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల, రక్తనిధి కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిఖిల, పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ అనిల్, మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సీహెచ్ఓ ప్రేమలత, డెమోలు సువార్త, ఎల్లయ్య, రవీందర్, ఎంపీహెచ్ఈఓ విప్లవ్ కుమార్, ల్యాబొరేటరీ టెక్నీషియన్లు శ్రీనివాసరావు, జ్యోతి, పీహెచ్ఎన్ రామేశ్వరి, సూపర్‌వైజర్ బజ్జీ సమ్మా, హెల్త్ అసిస్టెంట్లు రాజేష్, సత్యనారాయణ, శ్రీనివాస్, కమలాకర్, కేసి కుమార్, శరత్, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వెంచరామిలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే



**దారి లేక పనులు ఆగిపోవడంపై ఆవేదన**

**తహసీల్దార్‌తో ఫోన్ సంభాషణ..**

**సమస్యను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి**

**చిట్యాల, అక్టోబర్ 1(జనంసాక్షి ):** మండలం వెంచరామి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ ప్రాంతాన్ని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి గురువారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంట్, కంకర వంటి నిర్మాణ సామగ్రిని తరలించే రహదారిని కొంతమంది ఆక్రమించుకోవడంతో పనులు నిలిచిపోయాయని స్థానికులు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయితే నిరుపేదల సొంతింటి కల నెరవేరుతుందని, కేవలం దారి సమస్య కారణంగా పనులు మందగించడం తీవ్ర విచారకరమని అన్నారు. ప్రభుత్వానికి చెందిన రహదారిని అక్రమంగా కబ్జా చేసిన వారిపై అధికారులు వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.?అనంతరం ఈ విషయంపై చిట్యాల మండల తహసీల్దార్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే స్థలాన్ని పరిశీలించి, కబ్జా సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# సామాజిక సేవకుడు, శానబోయిన రాజ్ కుమార్

**సేవకులకు సముచిత స్థానం**

**శానబోయిన రాజ్ కుమార్ ఘనంగా సన్మానం**

**ముఖ్యఅతిథిగా హాజరైన ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు పొన్నం మొగిలి ముదిరాజ్**

**దుగ్గొండి, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి వైస్ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనటువంటి శానబోయిన రాజుకుమార్ ముదిరాజ్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపిక కావడం అభినందనీయమని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు పొన్నం మొగిలి ముదిరాజ్ అన్నారు. గురువారం మండలంలోని గిర్నిబావి కనిష్క ఫంక్షన్ హాల్.లో ముదిరాజ్ మహాసభ దుగ్గొండి మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సన్మాన సభకు ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు పల్లె రమేష్ ముదిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు పొన్నం మొగిలి ముదిరాజు హాజరై మాట్లాడుతూ నిత్యం సమాజంలో ఉంటూ సేవా కార్యక్రమాలు చేపడుతూ రక్తదానం శిబిరాలు నిర్వహిస్తూ ఎందరికి ఆదర్శంగా నిలుస్తున్న శానబోయిన రాజ్ కుమార్ సేవా దృక్పథం నికి సముచిత స్నానం దక్కిందన్నారు. వర్షాలు లేక చెరువులో నీళ్లు రాక ఉపాధి కోల్పోయి అయోమయంలో ముదిరాజ్ కుటుంబాలు ఉన్నాయని ప్రభుత్వం వెంటనే గుర్తించి కరువు మండల కరువు మండలం గా ప్రకటిస్తూ చెరువులకు (రకం) శిస్తూ మాఫీ చేస్తూ సబ్సిడీ రూపంలో ఇచ్చే చేప పిల్లలను నగదు రూపంలో మత్స్య సహకార సంఘాలకు బదిలీ చేసి కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. సన్మాన గ్రహీత శానబోయిన రాజకుమార్ మాట్లాడుతూ దుగ్గొండి మండలంలో ఉన్నటువంటి ఆయా గ్రామాల ముదిరాజ్ కుల పెద్దలు పెద్ద ఎత్తున తరలివచ్చి నాకు శుభాకాంక్షలు తెలిపి నాపై చూపిస్తున్న ప్రేమ ఆధార అభిమానాలు ఎల్లప్పుడూ ఉండాలని మీరు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని రాబోయే రోజుల్లో అందరి సంక్షేమం కోసం పనిచేస్తానని సన్మానం చేసిన అందరికీ దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షులు పొన్నం మొగిలి సన్మాన గ్రహీత ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి వైస్ చైర్మన్ శానబోయిన రాజకుమార్ పిఆర్ ముదిరాజ్ సేవాసమితి సేవకులు దండు చిరంజీవి ముదిరాజ్, మహాసభ మండల అధ్యక్షులు పల్లె రమేష్ ముదిరాజ్ , ప్రధాన కార్యదర్శి నేదురు రాజేందర్, ఉపాధ్యక్షులు ఓరుగంటి తిరుపతి, మంద దేవరాజు, సారా రాములు, యూత్ అధ్యక్షులు ఈర్ల నరేష్ ముదిరాజ్, జిల్లా ముదిరాజ్ మహాసభ నాయకులు ఓరంగంటి అశోక్, గొర్రె రాంబాబు ముదిరాజ్, మండల ఉపాధ్యక్షులు చాగంటి రాజు ముదిరాజ్, మండల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# మాస్టర్ స్విమ్మింగ్‌లో సత్తా చాటిన సింగరేణి క్రీడాకారులు

## అభినందించిన జీఎం రాజేశ్వర్ రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (జనంసాక్షి):** మాస్టర్ స్విమ్మింగ్ జాతీయ క్రీడల్లో సింగరేణి కుటుంబానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించడం అభినందనీయమని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం ఏరియా జీఎం కార్యాలయంలో విజేతలను శాలువాలతో సన్మానించి అభినందించారు. జీఎం మాట్లాడుతూ మాస్టర్ స్విమ్మింగ్ జాతీయ క్రీడల్లో సింగరేణి మాజీ ఉద్యోగి కందుకూరి రాజేశ్వరరావు 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో వెండి పతకం సాధించారని, అదేవిధంగా బడే పూర్ణచందర్ రావు, కేటీకే-6 ఇంక్లైన్ ట్రమ్మర్ బడే భాస్కర్ రావు కుమారుడు 100 మీటర్ల బటర్ ఫ్లై స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం, 200 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో కాంస్య పతకం సాధించి ప్రతిభ చాటారని తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయని, సింగరేణి కుటుంబానికి చెందిన వారు జాతీయ స్థాయి మాస్టర్ స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించడం ఎంతో గర్వకారణమని, ముఖ్యంగా జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ మాస్టర్ స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయ స్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి సింగరేణి కీర్తిని మరింత ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో సాధించిన విజయాలకు కొనసాగింపుగా అంతర్జాతీయ మాస్టర్ స్విమ్మింగ్ పోటీల్లో కూడా విజయం సాధించి మరిన్ని పతకాలు సాధించాలని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి విశ్రాంత్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పరశు శ్రీనివాస్, స్విమ్మింగ్ కోచ్ పాత శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు



**కాళేశ్వరం, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం గ్రామంలోని హైస్కూల్, ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 4-వే సెగ్రిగేషన్ విధానంపై నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్టీల్ వాటర్ బాటిల్లను బహుమతులుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పరిశుభ్రత, చెత్తను తడి--పొడి తదితర విభాగాలుగా వేరు చేయడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని గ్రామ సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి తెలిపారు. స్వచ్ఛమైన గ్రామ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెమ్మాల సుధీర్ కుమార్ , వార్డు సభ్యులు నిట్టూరి మహేష్, విజయలక్ష్మీ, రెవెల్లి మమత, పెద్ది లక్ష్మీ, సయ్యద్ ఇమ్రాన్, బొల్లం రాజశేఖర్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీధర్ , పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.




# గెస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు

## ప్రిన్సిపాల్ సిహెచ్ పూర్ణచందర్ రావు

**మల్హర్, అక్టోబర్ 01( జనం సాక్షి)** మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ లో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్ పూర్ణచందర్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించే ఈ పోస్టుకు నెలకు రూ.16,500లు వేతనం ఉంటుందని బి.ఇడి(స్పెషల్ ఎడ్యుకేషన్) లేదా సాధారణ బి.ఇడితో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా అర్హత గల మండల అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని అర్హులు ఈ నెల 2 నుంచి 7వ తేదీ లోపు దరఖాస్తులను మోడల్ స్కూల్ లో సమర్పించాలని కోరారు.



## నీమ్మగూడెం గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన

**మహాముత్తారం అక్టోబర్ 01 (జనంసాక్షి)** సర్ ప్రక్రియ గ్రామంలో అందరికీ అవగాహన పొంది ఓటర్ లిస్టులో తప్పు ఒప్పులను సవరణ చేసుకోవాలని మండల తాసిల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నీమ్మగూడెం గ్రామంలో ప్రత్యేక సమగ్ర పరిశీలన ( సర్) ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితా సవరణలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఓటరుజాబితాలో పేర్లనమోదు,మార్పులు,తొలగింపులు,చిరునామా సవరణలు మరియు ఇతర వివరాల సవరణల గురించి అధికారులు వివరించారు. కార్యక్రమంలోపాల్గొన్నప్రజలకుఓటరుజాబితాలో తమ వివరాలను ఒకసారిపరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు లేదా మార్పులు ఉంటే అవసరమైన ఆధార పత్రాలతో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి అర్హుడైనఓటరుపేరుఓటరు జాబితాలో ఉండేలా చూడటం ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.గ్రామ ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, తాసిల్దార్ దండు శ్రీనివాస్, బిఎల్ఓ సుజాత బి ఎల్ ఏ సూపర్వైజర్ అజయ్, జాడి సడవాలి, గ్రామ ప్రజలు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలకు రూ. 2.50 లక్షల వస్తు సామాగ్రి బహుకరణ

### రిటైర్డ్ గణిత ఉపాధ్యాయులు పుల్లూరి జగన్మోహన్



**చెన్నారావుపేట, అక్టోబర్ 1 (జనంసాక్షి):** చెన్నారావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు రూ. 2.50 లక్షల విలువచేసే వస్తు సామాగ్రిని జల్లి జిల్లా పరిషత్ పాఠశాల రిటైర్డ్ గణిత శాస్త్ర ఉపాధ్యాయులు పుల్లూరి జగన్మోహన్ బహుకరించారు. తెల్సా తెలుగు అమెరికా అసోసియేషన్ వారి సహకారంతో రిటైర్డ్ గణిత శాస్త్ర ఉపాధ్యాయులు పుల్లూరి జగన్మోహన్ పాఠశాలకు 50 ఫ్యాన్లు, వంట సామాగ్రి అయిన గ్రైండర్, మిక్సీ, విద్యార్థినిల దాహార్తిని తీర్చే వాటర్ కూలర్ ఫ్రిడ్జ్, 20 కుర్చీలు మొత్తం రూ.2లక్షల 50 వేల విలువైన వస్తు సామాగ్రిని గురువారం పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు జగన్మోహన్ కు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి, ఉపాధ్యాయునీలు, విద్యార్థినిలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారిని పాపమ్మ, జల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది వెంకటేశ్వర్లు, కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి, ఉపాధ్యాయునిలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పరకాలలో అనుమానాస్పదంగా మహిళ మృతి

**పరకాల, అక్టోబర్ 1 (జనంసాక్షి):** పరకాల పట్టణంలోని ఆకులవాడలో గురువారం అనుమానాస్పద ఘటన చోటుచేసుకుంది. కోడెల సుగుణక్క (63) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందగా, ఆమె తల్లి కోడెల లక్ష్మమ్మ (85) తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మమ్మను మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. సుగుణక్క మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటన ప్రమాదవశాత్తా జరిగిందా? మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

# నర్సింగాపూర్ గ్రామంలో రూ.5 లక్షల సీసీ రోడ్డు ప్రారంభం



**మహా ముత్తారం, అక్టోబర్ 01 (జనం సాక్షి) :** సిఆర్ఆర్ పథకం కింద మహా ముత్తారం మండలం నర్సింగాపూర్,గ్రామానికి మంజూరైన రూ.5 లక్షల సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ సునీత, నరేష్ మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాడి రాజయ్య ప్రారంభించారు. గురువారం ఈ సందర్భంగా జాడి రాజయ్య మాట్లాడుతూ.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇ ని శ్రీ ు ం ద ్ ని ా ు ం ్ ు . నర్సింగాపూర్,గ్రామంలోసీసీరోడ్డునిర్మాణంతోప్రజలరాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు.సి అర్ అర్ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని జాడి రాజయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో, సర్పంచ్ ఎన్నం సునీత, నరేష్,మహిళా మండల అధ్యక్షులరాలు, ధరం సోత్ సుజాత,గ్రామ శాఖ అధ్యక్షుడు,సంధి సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు, లావుడ్య శ్రీనివాస్,మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఖయ్యూం,యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కొండ గొర్ల అశోక్, గ్రామ యూత్ అధ్యక్షులు,కలినేని దేవేందర్, గ్రామ మహిళా అధ్యక్షులురాలు, కొర్రల స్వరూప,మాజీ ఉపసర్పంచ్, గుడికందుల రాజయ్య, వార్డ్ మెంబెర్, మంత శిరిసా, దేవేందర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, హొట్కార్ కిషన్, కనుకుల శంకర్, ఉమ్మల దుర్గయ్య, నీలం రవీందర్, గాదె సమ్మయ్య, తుడి పుల్లారెడ్డి, యూత్ నాయకులు, గోంతి సుమన్, మరియు, మరుపాక రాజేంద్రప్రసాద్,కార్యకర్తలు, గ్రామ ప్రజలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌కు భారీ షాక్

## బీఆర్ఎస్‌లో చేరిన పలువురు నాయకులు

**గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి**

**కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామరక్ష**



**చిట్యాల (జనంసాక్షి):** మండలం కేంద్రంలోని వెంచరామి గ్రామ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు కీలక నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. స్థానిక సర్పంచ్ కాసురమా కుమార్ నాయకత్వంలో, మండల నాయకుల సమక్షంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని కొనియాడారు. కేసీఆర్ హయాంలో రైతులు, నిరుపేదల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను ప్రజలు నేటికీ గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో రైతులకు విద్యుత్, ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడేళ్లు కావస్తున్నా, ఇంకా గత ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే ప్రాధాన్యమిస్తున్నారని, ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టడం లేదని ధ్వజమెత్తారు. వెంచరామి నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు బీఆర్ఎస్‌లో చేరడం వల్ల చిట్యాల మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## జాతీయ ఆరోగ్య మిషన్‌లో 33 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

### డీఎంహెచ్ఓ మధుసూదన్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (జనంసాక్షి):** జాతీయ ఆరోగ్య మిషన్ కింద జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి.హెచ్. మధుసూదన్ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో మొత్తం 33 పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో ఎంఎల్హెచ్పీ 12, పీడియాట్రిషియన్ ఒకటి, జనరల్ ఫిజీషియన్ ఒకటి, స్టాఫ్ నర్స్ తొమ్మిది, ల్యాబ్ టెక్నీషియన్ నాలుగు, ఎస్టీఎల్ఎస్ ఒకటి, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్, స్పెషలిస్ట్ ఎడ్యుకేటర్ ఒకటి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఒకటి, సెకండ్ ఏఎన్ఎం మూడు పోస్టులు ఉన్నాయని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 3 ఉదయం 10:30 గంటల నుంచి 13న సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను జయశంకర్ భూపాలపల్లి ఐడీఓసీ ఎఫ్ 25 బ్లాక్ లో స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తు ఫారాలు, పోస్టుల వారీగా అర్హతలు, మార్గదర్శకాలు, ఇతర నిబంధనలను జిల్లా అధికారిక వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు అధికారిక ప్రకటనలో పేర్కొన్న నిబంధనలు పూర్తిగా పరిశీలించి నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

# కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ

### ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**శాయంపేట అక్టోబర్ 1 (జనం సాక్షి) :** శాయంపేట మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన 39 మంది లబ్ధిదారులకు 39,04,524 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ..గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పులపాలు చేసినప్పటికీ, ప్రజా ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమ పథకాలను కొనసాగిస్తోందన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఎల్ఓసీలను పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం , రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో పని చంద్ర మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని , పరకాల మార్కెట్ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి,నాయకులు,సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# వృద్ధులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

**న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ**



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 01 (జనం సాక్షి) :** అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రంగశాయిపేట, వరంగల్ లోని ఎలగందుల అమృత స్మారక, కన్నతల్లి వృద్ధాశ్రమాల్లో ఉచిత వైద్య శిబిరాలు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఆధ్వర్యంలో కార్యదర్శి కందుకూరి పూజ పర్యవేక్షణలో వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల మరియు రీజనల్ ఐ హాస్పిటల్ వారి సమన్వయ సహకారంతో వృద్ధాశ్రమాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాలలో వృద్ధులకు బి.పి., షుగర్, కంటి తదితర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సూచనలు అందించారుఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ "వృద్ధులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, వైద్యుల సూచన మేరకు మందులు సక్రమంగా వినియోగించాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడం, తగినంత నీరు త్రాగడం, వయస్సుకు అనుగుణంగా శారీరక వ్యాయామం చేయడం, తగిన విశ్రాంతి తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చని వివరించారు. వృద్ధుల ఆరోగ్యం, సంక్షేమం మరియు గౌరవప్రదమైన జీవనానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. వృద్ధులకు అవసరమైన న్యాయ సహాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు ఇతర సేవలపై కూడా అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. వేముల ప్రసాదరావు, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ చక్ర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హనుమకొండ, విశిష్ట అతిథిగా పాల్గొని వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. వృద్ధాప్యంలో శారీరక మార్పులతో పాటు వివిధ ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వృద్ధులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, కీళ్ల నొప్పులు, చూపు మరియు వినికిడి లోపాలు వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వైద్య సహాయం పొందాలని, వృద్ధులకు సంరక్షకులు అవసరమైన సహకారం మరియు మానసిక భరోసా అందించాలని డా. వేముల ప్రసాదరావు సూచించారు.

## రెండో వారం నుంచి మీ ప్రమాణం యాప్ ద్వారా హాజరు తప్పనిసరి..

● **కలెక్టర్ రాహుల్ శర్మ..**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఈ నెల రెండో వారం నుంచి తప్పనిసరిగా మీ ప్రమాణం యాప్ ద్వారా తమ హాజరు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెంపొందించడంతో పాటు ఉద్యోగుల్లో సమయపాలన, విధి నిర్వహణలో క్రమశిక్షణ మెరుగుపరిచేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. యాప్ ద్వారా హాజరు నమోదు ప్రక్రియ సజావుగా అమలయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సిబ్బందికి అవగాహన కల్పించి నమోదు చేపించాలని ఆదేశించారు. ఈ విధానంలో ఎలాంటి మినహాయింపు ఉండదని, యాప్ వినియోగంపై ఈడీఎం ద్వారా అవగాహన కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు.



## ప్రజాప్రతినిధులకు గౌడ సంఘం ఆధ్వర్యంలో సన్మానం

**వెంకటాపూర్(రామప్ప) అక్టోబర్01 (జనం సాక్షి) :** వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ లను ఘనంగా సన్మానం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ సుష్మిత ను సైతం వారు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ..గౌడ సంఘం కులదేవత అయిన ఎల్లమ్మ దేవాలయం వద్ద రూ. 5 లక్షలతో ప్రహరీ గోడ, గేటు నిర్మాణం చేపడతామని, అలాగే భక్తులకు నీటి వసతి కల్పించేందుకు బోరును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నూతన కమిటీ అధ్యక్షులు,సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్ ఉత్పత్తితో వినియోగదారులే యజమానులు

**ఎన్పిడిసీఎల్ డిఈ బి సారయ్య**



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 01 ( జనం సాక్షి ) :** సోలార్ విద్యుత్ ఉత్పత్తితో వినియోగదారులే యజమానులని ఎన్పిడిసీఎల్ డిఈ బి సారయ్య అన్నారు. స్టేషన్ ఘనపూర్ మునిసిపల్ పట్టణ కేంద్రంలోని ఎన్పిడిసీఎల్ సబ్ డివిజన్ కార్యాలయంలో సేవా-సేతు కార్యక్రమం ద్వారా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తితో వినియోగదారులుపొందే ప్రయోజనాలపై అవగా హన సదస్సు ఏర్పాటు చేశారు. మూడు రోజులు కొనసాగే ఈ అవగాహణ సదస్సులో భాగంగా మొదటి రోజు గురువారం ఎన్పిడిసీఎల్ ఘనపూ ర్ డిఈ బి సారయ్య ఆధ్వర్యంలో సోలార్ విద్యు త్ ఉత్పత్తిపై వినియోగదారులతో నిర్వహించిన అవగాహణ కార్యక్రమంలో డిఈ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి విని యోగదారులే మిగిలిన విద్యుత్ను సౌంస్థకు అమ్మి అదనపు ఆదాయం పొందవచ్చని అన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా గృహ వినియోగ దారులు తమ ఇళ్ల రూఫ్టాప్ పై సోలార్ ప్లాంటును ఏర్పాటు చేసుకొని నెలకు 360యూనిట్ల విద్యుత్ పొందవచ్చని,మిగులు విద్యుత్తుతో సౌంస్థ నుండి అదనపుఆదాయం పొందవచ్చనిఅన్నారు. సొంత పెట్టుబడి లేకుండా ప్రభుత్వం అందించే రాయితీ తో పాటు,బ్యాంకు ఋణం ద్వారా సోలార్ ఉత్పత్తి చేసి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి, విద్యుత్తును ఆదాచేసి ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. ఘనపూర్ ఏడిఈ పి రణధీర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెడ్కో అధికారులతో పాటు బ్యాంక్ అధికారులు పాల్గొ న్నారు. ఏఈలు రవీందర్, పి.శంకర్, శివకుమార్, శ్వేత సబ్ ఇంజనీర్ సాధన,హరిత వినియోగదా రులు పాల్గొన్నారు.

## రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలి

● **బీజేపీ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా**



**శాయంపేట, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శాయంపేట మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో శాయంపేట మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాయరాకుల మొగిలి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాయరాకుల మొగిలి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో విఫలమైందని విమర్శించారు. విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ, కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ ఉప్పు రాజు, జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ కానుగుల నాగరాజు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం రమేష్, అధికార ప్రతినిధి మోత్కూరు సత్యనారాయణ, కార్యదర్శి కడారి చంద్రమౌళి, సీనియర్ నాయకులు బూర ఈశ్వరయ్య,బాసాని విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ దంపతులకు నివాళులు



**నల్లబెల్లి, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** మండలంలోని లెంకాలపల్లి గ్రామ సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి, ఆమె భర్త మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు రవీందర్ దంపతులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గురువారం నిర్వహించిన వారి దశదినకర్మ కార్యక్రమానికి నర్సంపేట నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం నాయకులు హాజరై వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం కోఆర్డినేటర్ నాగిశెట్టి ప్రసాద్, నర్సంపేట డివిజన్ నాయకుడు నాడెం శాంతికుమార్, నెక్కొండ మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మాదాసు రవి, తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులను ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయించాలి

**మలుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు**

**కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలోకి తగిన గుర్తింపు..**



**ఏటూరునాగారం, అక్టోబర్ 01(జనంసాక్షి) :** రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్లో నల్గొండ, వరంగల్ ఖమ్మం, స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కంకణ బద్ధులై ఉండాలని కొత్తగా ఓటర్గా నమోదు చేసుకోను వారు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్స మాన కోర్స్ పూర్తి చేసి ఉండాలి కట్- ఆఫ్ తేదీ 01-11-2023 నాటికి లేదా అంతకుముందు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. 01-11-2026 నాటికి అర్హత కలిగి ఉండాలని తెలిపారు. కావాల్సిన పత్రాల్లో రెండు పాస్ ఫోటో సైజ్- ఫోటోలు డిగ్రీ ఒరిజినల్ లేదా ప్రొవిజినల్ సర్టిఫికెట్ ఆధార్ కార్డు ఓటర్ గుర్తింపు కార్డు నివాసా ధ్రువీకరణ పత్రం ఉండాలి. భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్సైట్లో ఫారం 18 - ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆన్లైన్లో ఏటూరు నాగారం తాసిల్దార్ కార్యాలయం లో పత్రాలతో ఫారం 18- సమర్పించవచ్చని తెలియజేశారు. ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరినారు. ఓటర్లుగా పట్టభద్రులను నమోదు చేయించాలని ప్రతి గ్రామంలో పట్టణంలో ప్రతి వార్డులో పట్టభద్రులు ఎంతమంది ఉన్నారని తెలుసుకొని వారిని ఓటర్లుగా నమోదు చేయించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## నానో యూరియా, డిఏపిపై అవగాహన

**నూగూర్ వెంకటాపురం సెప్టెంబర్ 01(జనం సాక్షి ):** ములుగు జిల్లా వెంకటాపురం మండలం రాచపల్లి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ ) పథకం కింద వ్యవసాయ శాఖ విస్తరణ అధికారినవీన్ ఆధ్వర్యంలో రైతులకి నానో యూరియా మరియు నానో డీఏపీ మీద అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నవీన్ రైతులతో మాట్లాడుతూ సాంప్రదాయ యూరియా మరియు డిఏపి బస్తాల కోసము రైతులు ఇబ్బంది పడకుండా అంతే సమర్థవంతంగా పనిచేసే నాన యూరియా మరియు నానో డీఏపీలను పంటల మీద పిచికారి కోసం వాడుకోవచ్చని తెలిపారు... నానో యూరియా 500 ఎం ఎల్ ఒక ఎకరాకి,నానో డి ఏ పీ 500 ఎం ఎల్ ఒక ఎకరాకి,చొప్పున మొక్క నాటిన 30 రోజుల తర్వాత నుండి పిచికారికి వాడుకోవచ్చని రైతులకు తగు సలహాలు చూచనలు చేశారు .వీటివల్ల ఎరువుల ఖర్చు తగ్గి పెట్టుబడి తగ్గుతుందని తద్వారా రైతుకి మేలు జరుగుతుందని సూచించారు.... ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ శ్యాం కుమార్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## దేవరాంపల్లిలో పోషణ మాసం

**కాటారం అక్టోబర్ 1 (జనం సాక్షి):** దేవరాంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గంగారం సెక్టార్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహాదేవపూర్ సీడీపీఓ రాధిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పోషణ మేళా, సీమంతాలు, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. సందర్భంగా తల్లులకు పోషకాహారం, ఆరోగ్యంపై క్విజ్ పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దేవరాంపల్లి ఉప సర్పంచ్ పల్లారపు వెంకటస్వామి, వార్డు సభ్యులు, ప్రథమ్ ఎన్‌జీవో సమ్మయ్య, సూపర్‌వైజర్ వీణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.